VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 13

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 17 మే 2025

## తిరంగా యాత్ర ర్యాలీకి పోటెత్తిన ప్రజలు

● ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి ప్రారంభమైన యాత్ర ● బెంజ్ సర్కిల్ వరకు సాగిన యాత్ర ● యువత, మాజీ సైనికులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు ● ప్రజలు సంఘీభావం గా దేశాభిమానం చాటుతూ తిరంగా యాత్రలో పాల్గొనడంతో కిక్కిరిసిన బందర్ రోడ్డు








**విజయవాడ,కలంకౌంటర్ :** పహల్గాం లో ఉగ్రదాడులకు ప్రతిగా దేశ ప్రధాని మోదీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం, శత్రుదేశం తోక ముడవడంతో మన సత్తా ప్రపంచానికి చాటి చెప్పడంతో దేశ ప్రజలు చేపట్టిన దేశవ్యాప్త తిరంగ యాత్ర కు మద్దతుగా శుక్రవారం తిరంగా యాత్ర ర్యాలీని విజయవాడ నడిబొడ్డున బందర్ రోడ్ లో నిర్వహించారు. ఈ తిరంగా యాత్రకు ప్రజలు, యువత, మాజీ సైనికులు, విద్యార్థులు చేతుల్లో జాతీయ జండాలను చేపట్టి పెద్ద సంఖ్యలో హాజరుకావడం వారిలోని దేశభక్తికి నిదర్శనంగా నిలుస్తుంది. తిరంగా యాత్ర ర్యాలీలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ జాతీయ నాయకురాలు పురందేశ్వరి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతినుద్దేశించి ప్రసంగించారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి తిరంగా యాత్ర ప్రారంభమైంది. బందర్ రోడ్ లోని పీవీపీ మాల్, వివంతా హోటల్ ల మీదుగా బెంజ్ సర్కిల్ కు చేరుకుంది. తిరంగా యాత్రకు మద్దతుగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు జాతీయ జండాలు చేతబూని ముందుండి ర్యాలీని నడిపించారు. తిరంగా యాత్ర ర్యాలీకి వేల సంఖ్యలో ప్రజలు హాజరై శత్రుదేశం దుచ్చర్యలపై మన దేశం ప్రతికారం తీర్చుకోవడంపై ప్రత్యక్షంగా మద్దతు తెలిపారు. మన దేశం ఒకరి జోలికి వెళ్లదు.. ఎవరైనా మన దేశం జోలికి వస్తే

- 2లో

## ధర తగ్గకూడదు... కొనుగోళ్లు ఆగకూడదు...

● రైతుల వద్ద మిగిలిన పొగాకును కంపెనీలు కొనాల్సిందే ● క్వింటాల్‌కు రూ.12,500 ధర చెల్లించాలి ● ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఉపేక్షించం, చర్యలకు వెనకాడం ● ఇకపై రైతులతో బైబ్యాక్ పాలసీ ఒప్పందం చేసుకోవాలి ● అధికారులు, ట్రేడర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం ● కిలోకు రూ.500 ధర తగ్గకుండా కోకో గింజల కొనుగోళ్లు ● కోకో కొనుగోళ్లకు త్వరలో ఆయిల్‌పామ్ తరహా విధానం ● తక్కువ ధరతో నష్టపోయిన మిర్చి రైతుల జాబితా రూపొందించండి ● సన్నరకాలు పండించేలా వరి రైతుల్ని ప్రోత్సహించండి ● వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల సమీక్షలో స్పష్టం చేసిన సీఎం



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో పొగాకు పండించిన రైతులు ఎట్టిపరిస్థితుల్లో నష్టపోకూడదని... పొగాకు రేటు తగ్గకుండా వెంటనే గిట్టుబాటు ధరకు ట్రేడర్లు కొనుగోలు చేసేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోళ్లను ఆపకూడదని, రైతుల దగ్గర ప్రస్తుతం ఉన్న పంట కొనుగోళ్లను వెంటనే జరపాలని స్పష్టం చేశారు. తాను రైతులు, పరిశ్రమలు-సంస్థల యజమానులు ఇద్దరితోనూ స్నేహపూర్వకంగా ఉంటానని, అలా అని రైతులకు అన్యాయం జరిగితే మాత్రం సహించేది లేదని చెప్పారు. ఈ విషయాన్ని ట్రేడర్లు దృష్టిలో పెట్టుకోవాలని, ప్రస్తుతం తలెత్తిన సంక్షోభాన్ని నివారించకుంటే ఉపేక్షించేది లేదని.. చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడనని ముఖ్యమంత్రి కొనుగోలుదారులను హెచ్చరించారు. ఉండవల్లి నివాసంలో శుక్రవారం ముఖ్యమంత్రి పొగాకు, కోకో, మిర్చి, ధాన్యం కొనుగోళ్లు-గిట్టుబాటు ధరలపై అధికారులు, ట్రేడర్లతో సమీక్ష నిర్వహించారు. ఇందులో ప్రధానంగా పొగాకు ధర పతనం కావడంపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర వచ్చేలా చూసి... రైతుల్లో అధికారులు నమ్మకం నింపాలని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురాకుండా చూడాలని స్పష్టం చేశారు.

**20 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు లక్ష్యం :** HD బర్లే పొగాకును నాణ్యత ఆధారంగా క్వింటాల్‌కు రూ.12,500కు కంపెనీలు కొనుగోలు చేయాలి. GPI, ITC కంపెనీలు తక్షణమే 20 మిలియన్ కిలోల కొనుగోళ్లను ప్రారంభించాలి. కంట్రోల్ రూమ్, వాట్సాప్ గ్రూప్ ద్వారా రోజువారీగా కొనుగోళ్లను పర్యవేక్షించాలి. వ్యవసాయ శాఖ ప్రతి రెండు రోజులకు ఒకసారి కొనుగోలు వివరాలను నివేదించాలి. వచ్చే సాగు సీజన్‌లో అంతర్జాతీయ డిమాండ్, ధరల ఆధారంగా HD బర్లే సాగు విస్తీర్ణాన్ని నియంత్రించేలా, ఈరకం సాగు వైపు మళ్లకుండా రైతుల్లో అవగాహన పెంచేందుకు 2025 జూన్ నుంచి సమావేశాలు నిర్వహించాలి.' అని ముఖ్యమంత్రి స్పష్టంగా పేర్కొన్నారు.

**పొగాకు నిల్వలు ఎక్కడా మిగలకూడదు :** రైతుల ఇళ్లల్లోనూ, పొలాల్లోనూ ఎక్కడా పొగాకు నిల్వలు కొనుగోళ్లు జరగకుండా మిగిలిపోకూడదని.... తక్షణం కంపెనీలు కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు చేసి అవసరమైతే గోడౌన్లలో నిల్వ ఉంచుకోవాలని సూచించారు. కొనుగోళ్లు ఏస్థాయిలో జరుపుతున్నారు, ఎంతమేర ధర చెల్లిస్తున్నారు... అనే నివేదిక సోమవారం కల్లా ఇవ్వాలని ఆదేశించారు. రైతుల్లో అసంతృప్తి రావడానికి వీల్లేదని, వారు నష్టపోకూడదని స్పష్టం చేశారు.

**అనూహ్యంగా పెరిగిన పొగాకు దిగుబడి :** ఎఫ్‌సీవీ, వైట్ బర్లీ, హెచ్డీ బర్లీ.. ఈ 3 రకాల పొగాకు కలిపి 2024-25 కాలంలో రాష్ట్రంలో 1,90,456 హెక్టార్లలో సాగు చేశారని... 450 మిలియన్ కేజీల దిగుబడి వచ్చిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇది అత్యధిక పంట దిగుబడి అని, మిగిలిన పంటల నుంచి పొగాకు సాగు వైపు రైతులు మొగ్గు చూపించడంతో... అనూహ్యంగా ఉత్పత్తి రెట్టింపై సమస్య ఉత్పన్నం అయ్యిందన్నారు.

**అధిక ధరలు చూపి మాయాజాలం :** పొగాకు ధర పతనం కాకుండా చర్యలు తీసుకోవడంలో పొగాకు బోర్డు విఫలమైందని... జీపీఐ, ఐటీసీ వంటి ట్రేడర్లతో సరైన సమన్వయం లేదని ముఖ్యమంత్రి అన్నారు. అత్యధిక ధరలు ఆశ చూపించి రైతులు పొగాకు సాగు చేసేలా చేస్తున్న కంపెనీలు, తీరా పంట చేతికి వచ్చేసరికి అమాంతం ధరలు తగ్గించడం సరికాదన్నారు. కనీస మద్దతు ధర కల్పించకుండా సంక్షోభాన్ని సృష్టిస్తున్నారని కంపెనీల తీరును ముఖ్యమంత్రి తప్పుబట్టారు.

**బై బ్యాక్ పాలసీ ఉంటేనే పొగాకు సాగు :** ప్రస్తుతం నెలకొన్న సమస్యను అధిగమించాలంటే బైబ్యాక్ పాలసీ ఉత్తమమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇకపై కంపెనీలతో రైతులు బైబ్యాక్ ఒప్పందం చేసుకోవాలని సూచించారు. బైబ్యాక్ విధానం అమలు, కొనుగోళ్లు జరిగేలా పొగాకు బోర్డు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి చెప్పారు. గ్లోబల్ డిమాండ్, సప్లయ్‌కు అనుగుణంగా ధర నిర్ణయించి రైతులకు లాభాలు వచ్చేలా చేయాలన్నారు. గిట్టుబాటు ధర ఇవ్వకుండా ఇబ్బంది పెడితే రైతులు పూర్తిగా పొగాకు పండించడం మానేస్తారని, అప్పుడు కంపెనీలన్నీ మూతపడే పరిస్థితి తలెత్తుందనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. అలాగే క్రాప్ రీషెడ్యూల్ చేయాలని, దీనికి యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. పొగాకు నుంచి ఇతర వాణిజ్య పంటల సాగు వైపు రైతులు మళ్లేలా అవగాహన కల్పించాలన్నారు. పంట మార్పిడి ద్వారానే రైతులు నష్టపోకుండా ఉంటారని ముఖ్యమంత్రి చెప్పారు.

**కొనుగోళ్ల ఆలస్యంపై కంపెనీల వివరణ :** పొగాకు బోర్డు కేవలం FCV పొగాకు ఉత్పత్తి, ప్రాసెసింగ్, ఎగుమతులను నియంత్రిస్తుంది. వైట్ బర్లే (వినుకొండ బర్లే)ను 90 శాతం కంపెనీలు కొనుగోలు చేశాయి. మిగిలిన HD బర్లే రకాన్ని రైతులు కంపెనీలతో ఏ విధమైన ఒప్పందం లేకుండా సాగు చేస్తున్నారు. మిర్చి, మొక్కజొన్న, పత్తిలో తెగుళ్లు ఎక్కువ అవ్వడం, HD బర్లే పొగాకు మొక్కలు స్థానిక నర్సరీల్లో అందుబాటులో ఉండటంతో రైతులు ఈ రకం సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. బాపట్ల, ప్రకాశం, నంద్యాల, గుంటూరు జిల్లాల్లో ప్రధానంగా ఈ రకాన్ని ఎక్కువ సాగు చేస్తున్నారు. దిగువ ఆకులు 15 మిలియన్ కిలోలు ఇప్పటికే కంపెనీలు, స్థానిక వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన పంటను కొనేందుకు ఎగుమతి ఆర్డర్ల కోసం ఎదురు చూస్తున్నామని, అలాగే గోదాముల కొరత, నిధుల సమస్య ఉందని, కూలీల సమస్య వల్ల గ్రేడింగ్, ప్రాసెసింగ్ ఆలస్యంగా సాగుతోందని కంపెనీలు చెబుతున్నాయి.

**కోకోకు గిట్టుబాటు ధర కల్పించాలి :** కోకో పంట గిట్టుబాటు ధరపైనా సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... కోకో గింజలను కిలోకు రూ.500 ధరకు తగ్గకుండా కొనుగోలు చేయాలని మాండలీజ్ సంస్థకు సూచించారు. కోకో గింజల కొనుగోలులో రైతులను ఏ కంపెనీ దోపిడి చేయడాన్ని సహించేది లేదన్నారు. ఇతర కంపెనీలతోనూ సంప్రదింపులు

- 2లో


## దివ్యాంగులకు గుర్తింపు కార్డులు

● మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ తో సదరం స్లాట్ బుకింగ్ ● స్లాట్ బుకింగ్ రోజు నుంచి నెల రోజుల్లో సదరం సర్టిఫికెట్లు ● 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ పి ఎం జె వై వందన స్కీమ్ ద్వారా రూ.5 లక్షల ఉచిత వైద్యం ● మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి ● సచివాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమంపై అధికారులతో మంత్రి డోలా సమీక్ష




**అమరావతి,కలంకౌంటర్ :** దివ్యాంగులకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అందులో భాగంగా రాష్ట్రంలో దివ్యాంగులకు గుర్తింపు కార్డుల జారీకి అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు అమరావతి వెలగపూడి సచివాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమంపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సదరం సర్టిఫికెట్లు, పీఎంజేవై వందన వయోవృద్ధుల హెల్త్ స్కీమ్ పై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.... గ్రామ సచివాలయాలు, మీసేవ కేంద్రాలతో పాటు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సదరం స్లాట్ బుకింగ్ కి చర్యలు చేపట్టాలి. స్లాట్ బుకింగ్ చేసుకున్న రోజు నుంచి నెల రోజుల లోపు సదరం సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. సుదూర ప్రాంతాలు, గిరిజన తండాల నుంచి వచ్చే దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా సదరం క్యాంపులు నిర్వహించాలి. దివ్యాంగులకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ గుర్తింపు కార్డులో అంగవైకల్య శాతం, దివ్యాంగుల వివరాలు ఉంటాయి. గుర్తింపు కార్డులు తయారీ, జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ పీఎంఆర్వై వందన స్కీమ్ ద్వారా రూ.5 లక్షల ఉచిత వైద్యం అందిస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

VAARAHI
SILKS
Threads of Luxury, Woven with love...



Patola Banaras | Kanjeevaram | Paithani | Organza | Chikankari | Soft Pattu | Muslin
Bandhini | Kanchi Tissue | Crush Tissue | Designer Tussar | Georgette | Fancy | Ikkat
VAARAHI SILKS Ph. 91000 03343 | www.vaarahisilks.com
Road No. 36, Jubilee Hills | Road No.1, Kukatpally.
SCAN TO FOLLOW US ON
INSTAGRAM FACEBOOK

# పేదల పక్షపాతికి సముచిత స్థానం

● పార్టీ వీర విధేయతకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పెద్దపీట వేశారు



**తిరుపతి,కలంకౌంటర్ :** పేదల పక్షపాతిగా, మచ్చ లేని రాజకీయ నాయకుడిగా, అనతి కాలములోనే బడా రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్తగా , నిస్వార్ధ ప్రజా సేవకుడిగా, తెలుగుదేశం పార్టీ వీర విధేయుడుగా గుర్తింపు పొందిన డాలర్స్ గ్రూప్ అధినేత, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సి దివాకర్ రెడ్డికి సముచిత స్థానం దక్కింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ఆయనకు తుడా చైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి దివాకర్ రెడ్డి 12-5-2025 చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ని మర్యాదపూర్వకంగా కలిశారు.

**పార్టీ వీర విధేయత కు సముచ్ఛితస్థానం - చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని..** తెలుగుదేశం పార్టీలో జెండా మోసిన వీర విధేయలను పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందనడానికి డాక్టర్ సి దివాకర్ రెడ్డి నిదర్శనమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కొనియాడారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన దివాకర్ రెడ్డికి తుడా చైర్మన్ పదవి రావడం హర్షనీయమన్నారు. దేశంలోనే తుడా ను నెంబర్ వన్ సంస్థగా తీర్చి దిద్ద గల సామర్థ్యం ఒక్క దివాకర్ రెడ్డి కి ఉందని కొనియాడారు. ఎమ్మెల్యే సతీమణి, టిడిపి మహిళా నాయకురాలు మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న ప్రతి వ్యక్తికి సీఎం చంద్రబాబు, నారా లోకేష్ తగిన ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డిని చిత్తూరులోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే దుశ్యాలువతో సత్కరించి అభినందించారు.

# టీజీ వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



**కందుకూరు, కలంకౌంటర్ :** మాజీ రాజ్యసభ సభ్యులు, ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు, వాసవి సత్ర సముదాయాల గౌరవ అధ్యక్షులు, ఆర్యవైశ్య పెద్ద టీజీ వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు కందుకూరు గ్రామ దేవత ఆదిపరాశక్తి శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో టీజీ వెంకటేష్ పేరుమీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ శ్రీ అంకమ్మ తల్లి అనుగ్రహంతో టి జి వెంకటేష్ ఆయురారోగ్యాలతో, సమాజానికి,మరిన్ని సేవలందిస్తూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కేశవరావు ఆకాంక్షించారు.

# రాష్ట్ర జై కాపు సేన లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ జై కాపు సేన రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడుగా లంకిశెట్టి బాలాజీ శుక్రవారం మంగళగిరిలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బసవ చినబాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలశెట్టి కొండలరావు నియామక ఉత్తర్వులను లంకిశెట్టి కి అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర కాపు కార్పొరేషన్ కు తక్షణమే డైరెక్టర్లను నియమించాలని, పెండింగ్లో ఉన్న 2,000 కోట్ల రూపాయలను విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఉప ముఖ్యమంత్రి కోనేదల పవన్ కళ్యాణ్ ను కోరారు. కాపులకి ఐదు శాతం రిజర్వేషన్ ఇస్తామన్న రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు నాయుడు హామీలను తక్షణమే అమలు చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు.కాపు పేదలను చదువుకోవడానికి విద్యా దీవెన అందజేయాలని ప్రతిభ కలిగిన విద్యార్థులకు విదేశీ విద్యకు రుణాలు ఏర్పాటు చేయాలని బాలాజీ కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మరియు నామినేషన్ పదవులలో కాపులకు జనాభా ప్రాతిపదికపై సీట్లు కేటాయించాలని బాలాజీ కోరారు.రాష్ట్ర స్థాయిలో ఏర్పడిన కమిటీలు జిల్లాల వారీగా మీటింగ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తద్వారా కాపుల ఐక్యతను మరింత పెంచే దిశగా కృషి చేస్తామని రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బసవ చిన్న బాబు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలశెట్టి కొండలరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కాపులు పునాదిరాళ్లు అని అన్నారు. అన్ని పదవులలో కాపులకు సమచిత స్థానం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 13 జిల్లాలు చెందిన అధ్యక్షులు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం లంకిశెట్టిని పలు జిల్లా కార్యవర్గ సభ్యులు సన్మానించారు.

# ధర తగ్గకూడదు... కొనుగోళ్లు ఆగకూడదు...

(మొదటి పేజీ తరువాయి)

జరిపి కిలో రూ.500 ధరకు కొనుగోలు చేసేలా సమన్వయం చేయాలని సూచించారు. కోకో సాగు నుంచి.... పంట విలువ పెంపు వరకు ప్రణాళికను మాండలీజ్ సంస్థ రూపొందించాలని చెప్పారు. ఆయిల్ పామ్ తరహాలో ఒక ప్రత్యేక విధానం రూపొందించాల్సి అవసరం ఉందన్నారు.

**కొనుగోలు సంస్థలు సహకరించాలి :** రైతులు, పరిశ్రమలకు అనుకూల వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని, ఆ విధంగానే కంపెనీలు ప్రభుత్వానికి సహకరించి రైతులకు న్యాయం చేయాలని మ-ుఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో కోకో రైతుల దగ్గర చివరి గింజ వరకు కొనుగోలు జరపాలన్నారు. ఫార్వర్డ్-బ్యాక్వర్డ్ ఇంటిగ్రేషన్‌కు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కోకో గింజల నాణ్యతను మెరుగుపరచడానికి కొనుగోలు సంస్థలు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా మద్దతు ఇస్తుందన్నారు.

**నాణ్యత సాకుతో ధర తగ్గిస్తున్న సంస్థలు :** రాష్ట్రంలో ఈ ఏడాది 12,000 మెట్రిక్ టన్నుల కోకో దిగుబడులు రాగా, ఇప్పటికే అధిక మొత్తంలో కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతేడాది అత్యధిక ధర చెల్లించి.. ఈ ఏడాది ఒక్కసారిగా ధర తగ్గించడంతో రైతుల్లో ఆందోళన మొదలైందని తెలిపారు. ఏపీలో కోకో పంట నాణ్యత తక్కువ ఉందని, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టు లేదని చెప్పి కొనుగోలు సంస్థలు ధరలు తగ్గించాయని అన్నారు. అయితే ప్రస్తుతం కోకో రైతుల దగ్గర మిగిలిపోయిన 2,000 మెట్రిక్ టన్నుల దిగుబడిని పూర్తిగా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు.

**నష్టపోయిన మిర్చి రైతులతో జాబితా :** వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా మిరప పంటను విక్రయించిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తక్కువ ధరకు అమ్మడం ద్వారా రైతులు ఎంతమేర నష్టపోయారనే దానిపై అధ్యయనం చేయాలని చెప్పారు. ఈ జాబితాలో దళారులను పూర్తిగా తొలగించి, నిజమైన రైతులను మాత్రమే చేర్చాలని స్పష్టం చేశారు. మిర్చి రైతుల్లో పురుగుమందుల వినియోగం తగ్గించేలా, ఎగుమతులు తగ్గట్టు నాణ్యతాప్రమాణాలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు.

**పూర్తి స్థాయిలో ధాన్యం సేకరణ :** రాష్ట్రంలో ఇంకా రైతుల దగ్గర మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అలాగే సన్న రకాలు పండించేలా రైతుల్ని ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మరోవైపు ఇప్పటివరకు ఈ రబీలో 1,41,144 మంది రైతుల నుంచి 17.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, వీరికి రూ. 3,258 కోట్లు జమ చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24 రబీ కాలానికి కేవలం 10.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 49,866 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.1,103 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. అలాగే, ఈ ఖరీఫ్‌లో 5,65,369 మంది రైతుల నుంచి 35.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, వీరికి రూ. 8,278 కోట్లు జమ చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24 ఖరీఫ్ కాలానికి కేవలం 29.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 4,97,907 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.6,549 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు.

# రికార్డు సృష్టించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డే

● మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ ● రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామం, వార్డులో కార్యక్రమాల నిర్వహణ ● నెలరోజుల పాటు యోగా ప్రాక్టీస్ చేసిన వారికి సర్టిఫికెట్ ● విశాఖలో లక్షల మందితో ప్రధాని యోగాసనాలు ● ఆర్‌కె బీచ్ నుంచి సముద్ర తీరం పొడవునా లక్షల మందితో యోగా డే నిర్వహణ ● యోగా డే అనంతరం కూడా రాష్ట్రంలో యోగా సాధన ఒక వ్యాపకంగా మారాలి ● జూన్ 21 విశాఖలో ప్రధాని పాల్గొనే అంతర్జాతీయ యోగా డే కార్యక్రమ నిర్వహణపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి,కలంకౌంటర్ :** విశాఖపట్నంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా డే ను రికార్డు సృష్టించేలా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జూన్ 21వ తేదీన జరిగే యోగా డే కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈసారి విశాఖలో పాల్గొంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రధాని స్వయంగా ప్రకటించారు. దీంతో ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. గ్రాండ్ సక్సెస్ చేసే అంశంపై ఫోకస్ పెట్టిన సిఎం...కార్యచరణపై క్యాంప్ ఆఫీస్‌లో అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' ను ఈ ఏడాది యోగా దినోత్సవ థీమ్‌గా తీసుకున్నారు. 'జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. ప్రధాని వస్తున్న ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించడంతో పాటు..రాష్ట్రంలో యోగా అభ్యాసానికి ఇది నాంది పలకాలి. రాష్ట్రంలో ప్రతి ఒక్కరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలి. కనీసం రెండు కోట్లమందికి ఈ కార్యక్రమం చేరాలి. 'యోగాంధ్ర-2025' థీమ్‌తో రాష్ట్రంలో ప్రచారం చేపట్టాలి. దీని కోసం ప్రజలను సన్నద్ధం చేసేందుకు ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ పాటించాలి. ఈ నెల రోజులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా ప్రాక్టీస్ జరగాలి. దీని కోసం ప్రైవేటు వ్యక్తులు, శిక్షకులు, యోగా అసోసియేషన్లు, నిపుణులను భాగస్వాములను చేయాలి. నెలరోజుల పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ప్రజలకు యోగా పై శిక్షణ ఇవ్వాలి. నెల రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారిని గుర్తిస్తూ సర్టిఫికెట్ ఇవ్వాలి. రాష్ట్రంలో గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా యోగా డేలో పాల్గొనే అంశంపై ప్రజల నుంచి రిజిస్ట్రేషన్లు తీసుకోవాలి. అదే విధంగా రాష్ట్రంలోని స్కూళ్లు, కాలేజీల విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలి. యోగా అనేది ప్రాథమిక బాధ్యత అనేలా ప్రతిఒక్కరూ భావించాలి. యోగా డే అనంతరం కూడా రాష్ట్రంలో యోగా సాధన ఒక వ్యాపకంగా మారాలి. రాష్ట్రంలో ప్రతి చోటా యోగాపై నెలరోజుల పాటు విస్తృత చర్చ జరగాలి. మనం నిర్వహించే యోగా డే విస్తృత ప్రాచుర్యం కల్పించడానికి ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థల సహకారాన్ని తీసుకోవాలి. ఎపిలో జరిగే యోగా డే గత 10 ఏళ్ల కార్యక్రమాలను తిరగరాసేలా ఉండాలి" అని సిఎం చంద్రబాబు సూచించారు.

**లక్షల మందితో కార్యక్రమం..** ఆర్‌కె బీచ్‌లో ప్రధాని కార్యక్రమం, ప్రజల పాల్గొనే ప్రాంతాలు, నిర్వహణపై అధికారులు ప్రజెటేషన్ ఇచ్చారు. ఆర్కె బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు అన్ని చోట్లా ప్రజలు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ రోడ్ వరకు సుమారు 2.5 లక్షల మంది యోగాలో పాల్గొనేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. యోగా నిర్వహించేందుకు 68 ప్రాంతాలు గుర్తించారు. ఆర్కే బీచ్, రుషికొండ, స్కూల్, క్రికెట్, పోలీస్, స్పోర్ట్స్, నావీ ప్రాంగణాలతో పాటు పలు ఖాళీ ప్రదేశాలను యోగా నిర్వహణకు గుర్తించారు. ఈ 68 లోకేషన్ల ద్వారా 2,58,948 మంది యోగా సాధనకు అవకాశం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. యోగా దినోత్సవాన్ని ప్రకటించి 10 ఏళ్లు పూర్తియిన సందర్భంగా, ప్రధాని పాల్గొనే విశాఖ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా 5 లక్షల మంది భాగస్వాములు అయ్యేలా ఆర్కె బీచ్ నుంచి శ్రీకాకుళం వరకు బీచ్ పొడవునా అన్ని అనుకూల ప్రాంతాల్లో ప్రజలను ఆహ్వానించి యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

**యోగాలో కొత్త రికార్డ్ సృష్టిద్దాం :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా డేగా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. యోగా డే రోజుల ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగా సాధన ఉంటుంది. 2015లో తొలిసారి అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు 36 వేల మందితో ఒకే వేదికపై నిర్వహించిన కార్యక్రమం గిన్నిస్ రికార్డుకు ఎక్కింది. తొలి ఏడాది 84 దేశాల్లో యోగాను నిర్వహించారు.

# నాల్గవ తరగతి ఉద్యోగుల బందరు టౌన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన లోయ ఆంజనేయులు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** నాల్గవ తరగతి ఉద్యోగుల బందరు టౌన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన లోయ ఆంజనేయులు శుక్రవారం జిల్లా కోర్టు రోడ్డు లోని ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ హాలు నందు నిర్వహించిన కార్యవర్గ ఎన్నికలకు బందరు టౌన్ అధ్యక్షులుగా లోయ ఆంజనేయులు కార్యదర్శి గా కె.రాజుకోశాధికారిగా కె. నీలకంఠన్ ఉపాధ్యక్షులుగా వి. నాంచారయ్య , శ్రీమతి బి.రమాదేవి సంయుక్త కార్యదర్శులుగా కె. వెంకటేశ్వరరావు, బి.యస్.యస్. తేజ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్న నాల్గవ తరగతి ఉద్యోగులు ఈ నూతన కార్యవర్గం 3 సంవత్సరాలు పాటు కొనసాగనుంది ఈ నూతన కార్యవర్గానికి ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు కె.యస్.యస్.యస్.ఎం.వి.ఆర్.వి ప్రసాద్, సహాయ ఎన్నికల అధికారిగా రాము. ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరించిన యస్.వి.కృష్ణారావు అనంతరం కౌన్సిల్ సమావేశం నిర్వహించి గౌరవ అధ్యక్షులు కమిటీ సభ్యులను ఎన్నుకున్న ఉద్యోగులు గౌరవ అధ్యక్షులుగా జీ.రమేష్, కమిటీ సభ్యులుగా డివిఎస్ఎన్ మల్లేశ్వరరావు, ఎన్.నిరీక్షణరావు, ఎన్.తిరుమల నాగరాజు లను ఎన్నుకోవడం జరిగింది

# ధరణి వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపారు

● రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ / నిర్మల్ / ఆసిఫాబాద్,కలంకౌంటర్ :** ధరణి పోర్టల్ వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపారని, గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల తొందరపాటు వల్ల వారి ప్రమేయం లేకుండానే రైతులు శిక్షను అన-ుభవించారని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు నిర్మల్ ఆసిఫాబాద్ జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ సీతక్క తో కలిసి భూభారతి అవగాహన సదస్సుల్లో మంత్రి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమలులో భాగంగా ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. భూభారతి నాలుగు పైలట్ మండలాల్లో 13వేల దరఖాస్తులు వచ్చాయని వీటినెంతవరకూ ఈనెల 30వ తేదీలోగా పరిష్కరించవలసిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. తహసిల్దార్, ఆర్డిఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్ఏ, ఆపై ట్రిబ్యునల్ స్థాయిలలో అప్పీల్ వ్యవస్థను ఈ చట్టం అనుసరించి రూపొందించినట్లు తెలిపారు. ప్రజలకు రెవెన్యూశాఖ సేవలు సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తుందని పేర్కొన్నారు. భూభారతి కార్యక్రమం ద్వారా భూ సంబంధిత సమస్యల పరిష్కారం వేగవంతంగా జరగడమే కాకుండా, రైతులకు నమ్మకమైన భూ సమాచారం అందుతోందని మంత్రి తెలిపారు. వాస్తవిక డేటాతో భూ పత్రాలను సమర్పించడం వల్ల భవిష్యత్తులో హక్కులపై ఆందోళనలు తలెత్తవని స్పష్టం చేశారు.ఉద్దేశ్యపూర్వకంగా భూ సమస్యలను అ పరిష్కృతంగా ఉంచుతే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. భూ యజమానుల భూ కమతాలకు మ్యాపులను పట్టాదారు పాసుపుస్తకంలో ముద్రించి ఇస్తామని తెలిపారు. ఆరువేల మంది లైసెన్సు కలిగి ఉన్న సర్వేయర్లను అధికారికంగా నియమిస్తున్నామని చెప్పారు. దీంతో భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియ సులభతరం అవుతుందని అన్నారు. అలాగే త్వరలోనే గ్రామ రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని అన్నారు. భూములు ఉన్న ప్రతి ఒక్కరికి భూ భారతి చట్టం ద్వారా రక్షణ ఏర్పడుతుందని అన్నారు. పట్టా లేని భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన పోడు భూముల రైతులకు పట్టాలు అందజేస్తామని అన్నారు.

# తిరంగా యాత్ర ర్యాలీకి పోటెత్తిన ప్రజలు



(మొదటి పేజీ తరువాయి)

చావుదెబ్బ కొడతామని ప్రపంచానికి చాటినట్లయిందని యువత తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ర్యాలీ లో భారత మాతకు జై అంటూ నినాదాలు మిన్నంటాయి. బెంజ్ సర్కిల్ లో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పురందేశ్వరీలు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మన రాష్ట్రానికి చెందిన మురలీనాయక్ అనే సైనికుడు దేశం కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టడం ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ముందుగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై దేశ సౌభ్రాతృత్వాన్ని, సార్వభౌమత్వం చాటి చెప్పే విధంగా దేశభక్తి గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు ప్రదర్శించారు. దేశభక్తి గీతాలు వీక్షకులను ఉర్రూతలూగించాయి.

# దేశ భద్రతే లక్ష్యంగా ఇస్రో 101వ రాకెట్ ప్రయోగం



**శ్రీహరి కోట,కలంకౌంటర్ :** ఈ ఏడాది జనవరిలో 100 వ రాకెట్ ప్రయోగాల మైలురాయిని అందుకున్న ఇస్రో తర-ువాత రాకెట్ లాంచ్ కు సిద్ధమవుతుంది ఈనెల 18 ఆదివారం శ్రీహరికోటలోని షార్ నుంచి సీఎస్ఎల్ వీ సీ 61ను ప్రయోగించనుండగా.... ఇది ఇస్రోకు 101వ రాకెట్ ప్రయోగం కానుంది. దీని ద్వారా భూ పరిశోధన ఉపగ్రహం రీశాట్ 18 ను కక్ష్యలోకి ప్రవేశ పెట్టనున్నారు. శనివారం ఉదయం 7:59 గంటలకు ఈ మిషన్ కౌంట్ డౌన్ ప్రారంభం కానుంది.. నిరంతరంగా 22 గంటల పాటు కొనసాగిన తర్వాత ఆదివారం ఉదయం 5:59 గంటలకు రాకెట్ నింగులోకి దూసుకెళ్లనుంది. ఈ ప్రయోగ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి ఇస్రో చైర్మన్ నారాయణన్ గురువారం సాయంత్రమే షార్ కు చేరుకున్నారు. ఈ సారి నింగిలోకి ఎన్వీఎస్ 02 శాటిలైట్ వెళ్లనుంది. ఇది నావిక్ రెండో సిరీస్‌కి సంబంధించినది. ఇది ఇచ్చే సమాచారం.. మ్యాప్‌లకు బాగా ఉపయోగపడుతుంది. భూమి, ఆకాశం, నీటిపై ప్రయాణాలకు ఈ శాటిలైట్ దారి చూపిస్తుంది. ఇది మొత్తం 2,250 కేజీల బరువు ఉన్న శాటిలైట్. ఇది భూ కక్ష్యా మార్గంలోకి వెళ్లాక.. జీపీఎస్ సేవల్ని అందిస్తుంది.

# బండి రామకృష్ణ కు అభినందనలు తెలిపిన పండ్ల వర్తక సంఘం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం పండ్ల వర్తక సంఘం అధ్యక్షులు బాసా వాసు ఆధ్వర్యం లో కృష్ణాజిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ గా ఎన్నికైన బండి రామకృష్ణ నివాసంలో కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా బండి రామకృష్ణను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. రామకృష్ణ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి పండ్ల వర్తక సంఘానికి తన వంతు సహకారం అందిస్తానని అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాష్ట్ర అధ్యక్షుడితో ఆత్మీయ కలయిక







**కర్నూలు,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ ను రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ఆర్యవైశ్యులు ఆత్మీయంగా కలిశారు. మహాసభ కు సంబంధించి పలు విషయాలు టీజీ వెంకటేష్ తో మాట్లాడారు.









మాజీ పార్లమెంట్ సభ్యులు మాజీ మంత్రి టీజీ వెంకటేష్ జన్మదిన సందర్భంగా వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన సన్మానించిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వరరావు.

–కర్నూలు, కలంకౌంటర్ :



అరుణాచల నిత్యాన్న సత్ర నూతన భవనం ప్రారంభోత్సవానికి కలం కౌంటర్ దినపత్రిక రవికుమార్ ను ఆహ్వానించిన శ్రీ అరుణాచలేశ్వర స్వామి ఆర్యవైశ్య వాసవీ నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.రత్నకుమార్, కార్యవర్గ సభ్యులు.

–కర్నూలు,కలంకౌంటర్ :



సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ కోశాధికారి, ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు.

–అమరావతి,కలంకౌంటర్ :



భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం పనులను పరిశీలించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తదితరులు

–విజయనగరం,కలంకౌంటర్ :





సీఎం చంద్రబాబు నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసిన కావలి ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ తటవర్తి రమేష్

–అమరావతి,కలంకౌంటర్ :

## నగరం పచ్చదనంతో పరిఢ విల్లాలి..

- టిడిపి సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్.





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** నగరం పచ్చదనం పరిశుభ్రతతో పరిఢవిల్లాలని రోడ్లపై వర్షపునీరు నిలువకుండా డ్రైనేజీ వ్యవస్థను సరి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో శు క్రవారం డ్రైనేజీ లు పూడిక తీస్తున్న సందర్భంగా మెయిన్ రోడ్ ప్రక్కనగల సబ్ జైల్ డ్రైన్ పూడికతీత పనులని గొర్రెపాటి గోపీచంద్ పర్యవేక్షించారు. గత ప్రభుత్వ హయాంలో నగరంలో డ్రైనేజీలలో షిల్ట్ కూడా తీయించకపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయ్యి ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొద్దిపాటి వర్షానికే మెయిన్ రోడ్లు కూడా మునిగిపోయే పరిస్థితి ఉండటంతో మంత్రి కొల్లు రవీంద్ర డ్రైనేజీ వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి పెట్టి, డ్రైనేజీలలో షిల్ట్ తీయించడం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నగరంపై ప్రత్యేక దృష్టి పెట్టి నగరంలో డ్రైనేజీ వ్యవస్థ తో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు త్వరలో శ్రీకారం చుట్టేలా మంత్రి రవీంద్ర కృషి చేస్తున్నారన్నారు. నగర సుందరీకరణకు ప్రజల సహకారం ఎంతో అవసరమ న్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, పి. వి. ఫణి కుమార్, కోస్తా మురళీకృష్ణ, రమణ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ కార్యక్రమానికి హాజరైన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి



**కందుకూరు,కలంకౌంటర్ :** అనంతపురం ఇంద్రప్రస్థ జిఎంఆర్ కాంపౌండ్ నందు కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు కుమార్తె శ్రీ చరిత, రాహుల్ ఆదిత్య ల వివాహ కార్యక్రమమునకు సహచర శాసనసభ్యులతో కలిసి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు.

## సరిహద్దు....

స్వతంత్రుడా ! బలూచిస్తాన్
ఎంత ధైర్యంగా స్థైర్యంగా ప్రకటించుకొన్నావ్!
కుందేలుగా ఉంటూనే, సింహాన్ని బావిలో పడేశావ్.
చీమగా పనిచేస్తూనే,చిట్టెలుకలా తెలివిగా గోతిలో పులిని పాతేశావ్ .
ఒక చేతితో భారత్ ను కరచాలనం చేస్తూ,
మరో చేతితో విరోధికి మూడుసార్లు 'తలాక్ ' సైగ చేశావ్.
ఎన్నో ఏళ్లుగా,
కండలు తీరిన సైనికుల ముందే యువజన పికిలి పిట్టల్ని గద్దలెత్తుపోయాయి.
కలసి జీవించాలన్న మీ ఆశల చిత్రపటాల్ని ఉగ్రవాద పంది కొక్కులు కొరికేశాయి.
మొక్కవోని మీ దీక్షకు మద్దతే లేకుండా తీవ్రవాదులు తుపాకుల్తో రణపహారా కాచారు.
అయినా!
రాతిలో మొలచిన మొక్కలా మీ ధైర్యం పెద్దదయ్యింది.
యుద్ధంతో మొద్దుబారిన కొత్తగా నవ యవ్వన తేజస్సు ప్రజ్వరిల్లింది.
మీ బానిస దేహాల్లోంచి సూపర్ మ్యాన్లు ఉదయించారు.
కళ్ళముందే మీ సంపద ఆవిరౌతుంటే సునామీ లా మీ కంట్లో రుధిర కాసారం ఉప్పొంగింది.
మీరనుకున్నట్లుగా!
శత్రువుతోఉన్న బానిస తుప్పును వదిలించుకొన్నారు.
దశాబ్దాలుగా కన్న కలను చిన్న కిటుకుతో చిటికెలో సాధించారు.
ఇక నీ దేశంలోపూచే పూలన్నీ మీవే .
పిట్టల వంటి స్వచ్ఛాగానం మీదే
ఉదయించే సూర్యోదయం మీదే
ప్రవాహమై
ఒక స్వతంత్ర ప్రదేశమై
మీ దేశం మీరేలుకోండి .
మీ దేశంలో మీరు మీరై జీవించండి.




**గాదంశెట్టి శ్రీనివాస్**
**గిడుగురామ్మూర్తి**
**రాష్ట్ర పురస్కార**
**గ్రహీత, ఉప్పుగుండూరు, ప్రకాశం జిల్లా.**

# మాజీ మంత్రి టీజీ వెంకటేష్ జన్మదినోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు సీహెచ్ ఆర్











**కర్నూలు,కలంకౌంటర్ :** ప్రత్యేక సంచిక ఆవిష్కరించిన మంత్రి టీజీ భరత్,మాజీ మంత్రి టీజీ వెంకటేష్,ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ ఆర్, మహాసభ మాజీ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బరాయుడు, వాసవి సత్ర సముదాయములు ప్రధాన కార్యదర్శి ఇల్లూరి లక్ష్మయ్య, దేవకీ వెంకటేశ్వర్లు, మహాసభ రాష్ట్ర నాయకులు మాటూరి రంగనాథ్, బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక సేవకుడు మాజేటి గోపాలకృష్ణ, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పురావురి రజిని, మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వేంకటేశ్వర్లు, కాణిపాకం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు మువ్వల నరసింహులు శెట్టి, మదనపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓమ్ ప్రకాష్,ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట హనుమంతరావు,ప.గో.జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, ఆర్యవైశ్య యువజన విభాగం రాష్ట్ర నాయకుడు కృష్ణ కిరణ్,అరుణాచల అన్న.సత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు రత్నకుమార్,బొమ్మ హేమ సాయి బాబు,బొమ్మ మురళీ తదితరులు.

**75 వ జన్మదినోత్సవం 75కిలోలు కేక్...** మాజీ మంత్రి టీజీ వెంకటేష్ 75 వ జన్మదినోత్సవం సందర్భంగా 75 కిలోలు కేక్ మాజీ మంత్రి టీజీ వెంకటేష్ కట్ చేశారు. రాష్ట్ర నాయకులు, వి ఐ పి లు, రాజకీయ పార్టీ నాయకులు,సేవా సంస్థలు ప్రతినిధులు ఈ కేక్ ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు కొప్పురావురి రజిని ని అభినందించారు. ప్రత్యేక ఆకర్షణగా కేక్ నిలిచింది.













Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com